www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి 2024
5
తూర్పుగోదావరి

రిసెప్షన్ సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాజానగరం

సార్వత్రిక ఎన్నికల కోసం నన్నయ్య యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను జెసి ఎన్.తేజ్‌భరత్ ఆర్‌డిఒ చైత్రవర్షిణితో కలిసి శనివారం పరిశీలించారు. అలాగే వివిధ నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాధవీలత ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. ఎన్నికల ఓటింగు పూర్తి అయిన తదుపరి బ్యాలెట్ యూనిట్స్ నియోజక వర్గాల నుంచి నన్నయ్య యూనివర్సిటీకి చేరుకుంటాయని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ కౌంటర్‌లో పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారన్నారు. ప్రస్తుతం రిసెప్షన్ కౌంటర్‌కు సంబంధించిన పనులు చురుగ్గా జరుగుతున్నాయని, వాటిని సాధ్యమైనంత తొందరలో పూర్తి చేసేలా దిశా నిర్దేశం చేశామన్నారు. వారి వెంట నన్నయ్య యూనివర్సిటీ ప్రతినిధులు ఉన్నారు.

మోగిన ఎన్నికల నగారా

ఎన్నికల షెడ్యూల్ విడుదల
అమల్లోకి వచ్చిన కోడ్
ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఇప్పటికే జిల్లాలో వేడెక్కిన రాజకీయం ఎలక్షన్ నోటిఫికేషన్ ప్రకటతో మరింత హాట్‌గా మారింది. ఎన్నికల ప్రకటనతో జిల్లా పాలన అధికారుల చేతుల్లోకి మారింది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి అధికారులు పనులు చాలా వరకూ పూర్తి చేశారు. మిగిలిన వాటినీ వేగవంతం చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ కూయడంతో జిల్లాలో నాయకుల విగ్రహాలకు ముసుగులు పడ్డాయి. ఫ్లెక్సీల తొలగింపునకు రంగం సిద్ధమైంది.

తూర్పు గోదావరిలో ఓటర్ల వివరాలు

జిల్లాలో 16,05,762 మంది ఓటర్లు ఉన్నారు. 7,85,142 మంది పురుష ఓటర్లు, 8,20,515 మంది మహిళా ఓటర్లు, 105 మంది ట్రాన్సజెండర్స్ ఓట్లు ఉన్నాయన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు గాను 1569 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు

నియోజకవర్గం	ఓటర్లు
రాజమండ్రి అర్బన్	2,60,360
రాజమండ్రి రూరల్	2,71,159
రాజానగరం	2,13,911
అనపర్తి	2,23,255
నిడదవోలు	2,11,874
కొవ్వూరు	1,83,405
గోపాలపురం	2,41,798

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. నాలుగో విడతలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మే 13న ఎన్నికల పోలింగ్ ఉంటుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలను విడుదల చేస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 21 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే అధికారులు ఎన్నికల ఏర్పాట్లను దాదాపుగా పూర్తి చేశారు. మూడు జిల్లాల్లోనూ 13 వేల మంది ఎన్నికల సిబ్బందిని నియమిస్తున్నారు. 21 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలకు తగ్గట్టుగా ఎన్నికల సిబ్బందిని సమకూర్చుకోవడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 1,637, తూర్పుగోదావరి జిల్లాలో 1,644, కోనసీమ జిల్లాలో 1,569 పోలింగ్ స్టేషన్లున్నాయి. ఒక్కో పోలింగ్ స్టేషన్లో ఒక పీవో, ఒక ఏపీవో, ఇరువురు పోలింగ్ క్లర్కులు, మరో ఇద్దరు విధులు నిర్వహించే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో పాటు 20 శాతం సిబ్బందిని అదనంగా అందుబాటులో ఉంచుతారు. ఇలా మొత్తంగా 13,032 మందితో పాటు 5,814 మంది అదనంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వివిధ శాఖల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు 45 అంశాలతో కూడిన ప్రత్యేక ఫార్మాట్లో అప్లోడ్ చేయాలని ఇప్పటికే అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఉద్యోగులు వ్యక్తిగతంగా అన్ని వివరాలను నమోదు చేసి అప్ లోడ్ చేశారు.

ఉండ్రాజవరం మండలం చివటంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో 4,850 పోలింగ్ కేంద్రాలు

మూడు జిల్లాల్లో ఏడేసి అసెంబ్లీ నియోజకవర్గాలుండగా కాకినాడ జిల్లా పరిధిలో 1,637, తూర్పుగోదావరి జిల్లాలో 1,644, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,569 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో సమస్యాత్మకంగా ఉన్న 2,426 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాల్లో వీడియో కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను చిత్రీకరిస్తారు.

గూడూరి శ్రీనివాస్ ఎంపీ అభ్యర్థి | మార్గాని భరత్‌రామ్ రాజమండ్రి అర్బన్ | చెల్లుబోయిన వేణు రాజమండ్రి రూరల్ | జక్కంపూడి రాజా రాజానగరం

తానేటి వనిత గోపాలపురం | సత్తి సత్యనారాయణరెడ్డి అనపర్తి | జి.శ్రీనివాస్‌నాయుడు నిడదవోలు | తలారి వెంకట్రావు కొవ్వూరు

వైసిపి అభ్యర్థులు వీరే...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి అభ్యర్థుల తుది జాబితా ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో నాలుగు నియోజక వర్గాలను, ఎంపి స్థానాన్ని గతంలో ప్రకటించింది. తరువాత పరిణామాల నేపథ్యంలో వారు ఇన్‌ఛార్జులే అని, తుది ప్రకటన తరువాత చేస్తామని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో టిక్కెట్ల విషయంలో గందరగోళం నెలకొంది. తాజాగా శనివారం తుది జాబితాను వైసిపి అధిష్టానం ప్రకటించింది. జిల్లాలో కొత్తగా సిట్టింగ్ ఎంఎల్‌ఎలు అందరికీ టిక్కెట్లు ఖరారయ్యాయి. రాజానగరం నియోజక వర్గం నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, సిట్టింగ్ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, నిడదవోలు నియోజక వర్గం నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ జి.శ్రీనివాసనాయుడు, రాజమహేంద్రవరం సిటీ నుంచి ఎంపి భరత్ రామ్, రూరల్ నియోజక వర్గం బరిలో చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు నియోజక వర్గం నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు, గోపాలపురం నియోజక వర్గం నుంచి మంత్రి తానేటి వనిత బరిలో ఉన్నారు.ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పోటీ చేయనున్నారు.

గ్రూప్ -1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గ్రూప్-1 పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెసి తేజ్‌భరత్, ఇతర అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలను సిసి టివీల పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ పరిశీలించే, తనిఖీలు నిర్వహించే స్క్వాడ్స్ అధికారుల వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సౌకర్యార్థం కలెక్టరేట్‌లో 8977935609 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కంట్రోల్‌రూమ్ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, జిల్లా అధికారులు డి.బాలశంకరరావు, ఎమ్‌డి.అలిముల్లా, ఎ.ముఖలింగం పాల్గొన్నారు.

వైసిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి- గోకవరం

తోట నరసింహంకు టిక్కెట్ ఖరారు కావడంతో గోకవరం మండలంలో వైసిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. గోకవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి సుంకర శ్రీవల్లి, భర్త వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నెరవేర్చే గొప్ప మనసున్న నాయకుడన్నారు. జగ్గంపేట నియోజకవర్గం టికెట్ తోటకు ప్రకటించడం దీనికి నిదర్శనం అన్నారు. ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇటీవల కాలంలో మృతి చెందిన పలువురు జనసేన పార్టీ కుటుంబ సభ్యులకు, రాజానగరం టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, ఆయన భార్య వెంకటలక్ష్మి చేతులు మీదుగా ఇన్సూరెన్స్ చెక్కులు అందజేశారు. శనివారం రఘుదేవపురం గ్రామంలో జనసైనికుడు బాకూరి సూర్యారావు, సింగవరం గ్రామంలో జనసైనికుడు బర్ల వెంకటరావు కుటుంబాలకు ఈ చెక్కులను అందించారు. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కుటుంబ సభ్యుల భద్రతకై ప్రవేశపెట్టిన, క్రియాశీలక సభ్యత్వ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అణచివేతపై ధర్మన్న అక్షర పోరాటం

కుసుమ ధర్మన్న జయంతి సభలో విసి పద్మరాజు

ప్రజాశక్తి - రాజానగరం

దళితులు, బడుగు బలహీన వర్గాల అణచివేతపై అక్షర పోరాటం చేసిన మహా యోధుడు కుసుమ ధర్మన్న అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి పద్మరాజుఅన్నారు. నన్నయ యూనివర్శిటీ, హైదరాబాద్‌కు చెందిన కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్లో విశ్వవిద్యాలయ తెలుగుశాఖ నిర్వహణలో తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాల ప్రదానం కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విసి కె.పద్మరాజు హాజరై మాట్లాడారు. రాజమహేంద్రవరం వాసియైన కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవానికి నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావడం శుభపరిణామం అన్నారు. శతాబ్దాల చరిత్రగల సాంస్కృతిక రాజధానిలో సంఘ సంస్కరణ దీప్తిగా కుసుమ ధర్మన్న రచనలు దశ దిశలా వ్యాపించాయన్నారు. తొలి తెలుగు దళిత కవిగా నిలిచి ఆనాటి సమాజంలోని ఎన్నో లోపాలపై కలంతో పోరాటం చేసి, హరిజనోద్ధరణకై రచనలు చేశారన్నారు. మద్యపాన నిషేధంపై ధ్వజమెత్తడమే కాకుండా సమతా భావనకు, సంఘ సంస్కరణకు నడుం బిగించి అలుపెరగని పోరాటం చేసిన ఆదర్శ శిఖరం ధర్మన్న అని తెలిపారు. 1921లో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం' గేయానికి భిన్నంగా నల్ల దొరలు పాలనకొచ్చినంత మాత్రాన దళితులకు వారిగేదేమీ ఉండదని నిర్మొహమాటంగా 'మా కొద్దీ నల్ల దొరతనం..' అని ఎలుగెత్తి చాటిన తొలి దళిత విప్లవ కవి కుసుమ ధర్మన్న అని కొనియాడారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కుసుమ ధర్మన్న పని చేశారన్నారు. జయభేరి పత్రికను స్థాపించి దళితులను చైతన్య పరిచి హక్కుల కోసం పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాధ కుసుమ, సదస్సు కన్వీనర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణలను అభినందించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన విధానాలు తెలియజేసారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్ మాట్లాడుతూ సామాజిక ఆత్మగౌరవం చైతన్యం కుసుమ ధర్మన్న అనే అంశంపై ఉపన్యసించారు. కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యకురాలు డాక్టర్ రాధకుసుమ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన కుసుమ ధర్మన్న కవి విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. సదస్సు అధ్యకులు ఆచార్య డి.జ్యోతిర్మయి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యాన్ని చదువుతున్న నేటి తరం వివక్షత లేని సమాజం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి, విఎస్ఎం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ర్యాలి శ్రీనివాసు, కందుకూరి వీరేశలింగం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ పివిబి.సంజీవరావు కుసుమ ధర్మన్న సాహిత్య విశేషాలను తెలిపారు. జాతీయ సదస్సులో భాగంగా 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్ర సమర్పణలతో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.

తరపట్లకు కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారం అందిస్తున్న విసి పద్మరాజు తదితరులు

తరపట్లకు కుసుమ ధర్మన్న పురస్కారం

కుసుమ ధర్మన్న కళాపీఠం వారిచే సాహితీ సేవ పురస్కారాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు డా.తరపట్ల సత్యనారాయణకు వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రదానం చేశారు. తరపట్ల సత్యనారాయణకు ప్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు రాధ కుసుమ తెలిపారు. అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. మధ్యాహ్నం జాతీయ సదస్సులో భాగంగా 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రాలను సమర్పించారు. కవి సమ్మేళనంలో 53 మంది కవులు కవితా గానం చేశారు. ముగింపు సమావేశంలో సదస్సు కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తొలి దళిత కవి, వక్త, జయభేరి పత్రిక సంపాదకుడు, ఉద్యమకారుడు, ఆయుర్వేద వైద్యుడు, సాహితీ కోవిదుడు, ఆంగ్ల-ఆంధ్ర భాషల్లో పండితునిగా కుసుమ ధర్మన్న ఎదిగారని చెప్పారు. ఎంత ఎదిగిన తన జాతిపై జరుగుతున్న వివక్షతను రూపుమాపడానికి "మాకొద్దీ నల్లదొరతనం" గేయరచయితగా ప్రసిద్ధుడయ్యారని చెప్పారు. జాతీయ సదస్సు నిర్వహణకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ, తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, అధ్యాపకులు డా.తలారి వాసు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సోమవారము నుంచి జరిగే పదోతరగతి పరీక్షలకు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. అన్ని సమన్వయ శాఖలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశామన్నారు. 18 తేదీ నుంచి 27 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటల్లోపు పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తారన్నారు. 10 గంటల తరువాత అనుమతించబోరని స్పష్టం చేశారు. విద్యార్థులు ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్కూల్స్ ద్వారా రెగ్యులర్ విద్యార్థులలో బాలురు 12,112 మంది, బాలికలు 11,569 మంది మొత్తం 23,681 హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రైవేట్ గా బాలురు 3,651 మంది, బాలికలు 2658 మంది మొత్తం 6309 మంది పరీక్షకి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. నిర్వహణ వారీగా పరీక్షా కేంద్రాలు: ఏడు ప్రభుత్వ స్కూల్, 75 జెడ్పీ హై స్కూలు, 16 మునిసిపల్ స్కూల్స్, 32 ప్రైవేట్ స్కూల్స్, 3 ఎయిడెడ్ పాఠశాలలు , 2 ఏపి సాంఘిక సంక్షేమ వసతి గృహాల స్కూల్స్ , 2 ఏపి గురుకుల పాఠశాలలో పరీక్షలకి ఏర్పాట్లు పూర్తి చేశా మన్నారు. పరీక్షలకు అరగంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయం

ప్రజాశక్తి-నల్లజర్ల

త్వరలో జగన్ రాక్షస పాలన నుంచి ఎంపి ప్రజలకు విముక్తి లభించనుందని ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయమని టిడిపి ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గం అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు, అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 45 రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్‌ను ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనకు ముగింపు పలికే సమయం శనివారం నుంచే మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు నిమ్మలపూడి ప్రసాద, వై.బ్రహ్మారాజు, పి.రతీష్ జమ్మల వీరవెంకటసతీష్, వై.శ్రీనివాసరావు, కండెపు వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి -పెరవలి

మండలం ముక్కామల గ్రామ శాఖా గ్రంథాలయంలో అమరజీవి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్ర సాధకులు పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్‌వివి.సూర్యనారాయణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడమైనది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు, పాఠకులు పాల్గొన్నారు

విజేస్‌లో వ్యవస్థాపక అభివృద్ధి ప్రక్రియపై సదస్సు

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని దివాన్ చెరువు విజేస్ ఫార్మసీ కళాశాలలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్, విశాఖపట్నం ఆధ్వర్యంలో వ్యవస్థాపకత అభివృద్ధి ప్రక్రియపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో ఎంఎంఇ- డిఎఫ్‌ఒలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఎస్ఎల్ఎన్.కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందడమే కాకుండా ఫార్మా పరిశ్రమలు స్థాపించి అనేక మందికి ఉపాధిని కల్పించే అవకాశం ఉంటుందన్నారు. కంపెనీల స్థాపనకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ పథకాలు వంటివాటిని వివరించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వివి.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సొంతంగా పరిశ్రమల స్థాపన ద్వారా ఉన్నతంగా ఎదిగే వీలుంటుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర మాట్లాడుతూ వ్యవస్థాపకత అభివృద్ధి ప్రక్రియపై అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ శకుంతల, డీన్ డాక్టర్ కె.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు

గోకవరంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి- గోకవరం

సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్నా నేపథ్యంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్సు బలగాలతో గోకవరం, పరిసర గ్రామాల్లో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గోకవరం ఎస్ఐ నాగరాజు మాట్లాడారు. ప్రజల స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, ఓటు హక్కు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించడానికి పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని, పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

రక్తదానం ప్రాణదానంతో సమానమని తాళ్లపూడి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోకవరపు బాబులు అన్నారు. ఆర్యవైశ్య సంఘం, తాళ్లపూడి ప్రెస్ క్లబ్, ఇతర సేవా సంస్థలు సంయుక్తంగా శనివారం గ్రామంలోని సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. ఈ శిబిరాన్ని బాబులు ప్రారంభించి మాట్లాడారు. రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్న జిల్లా మానవతా రక్త నిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు కృషి అభినందనీయమన్నారు. తాళ్లపూడి సాయిస్ఫూర్తి ఆసుపత్రి సహకారంతో దీన్ని నిర్వహించారు. సుమారు 60 మంది రక్తదానం చేశారు. రాజమండ్రి జక్కంపూడి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు వైద్య సిబ్బంది తాళ్లపూడి సాయిస్ఫూర్తి హాస్పటల్ గైనకాలజిస్ట్, జనరల్, ఆర్థో వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, ప్రెస్ క్లబ్, నందన ఫౌండేషన్, చిడిపి దేవోక్తి ఆర్గనైజేషన్, జనహిత సేవాసమితి సభ్యులు సహకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జొన్నకూటి ప్రమోద్‌కుమార్, నందన ఫౌండేషన్ ప్రతినిధి డి.రవి, ఆలీ, దేవోక్తి ఆర్గనైజేషన్ ప్రతినిధి ప్రత్తిపాటి అభిజ్ఞగో ం పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

లోక్ అదాలత్‌తో తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

లోక్ అదాలత్‌తో తక్షణ పరిష్కారం లభిస్తుందని, తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని కొవ్వూరు జిల్లా 9వ అదనపు జడ్జ్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కొవ్వూరు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 14 వాహన ప్రమాద కేసులు, మూడు మనోవర్తి కేసుల, 35 చెక్ బౌన్స్ కేసులు, సివిల్ కేసులు, 86 క్రిమినల్ కేసులు, 13 లిటిగేషన్ కేసులు 13 పరిష్కారం అయినట్లు జడ్జి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

శేషారావు మద్దతు కోరిన కందుల

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, పెరవలి

కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ శనివారం టిడిపి మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావును ఆయన స్వగృహం వేలివెన్నులో వ్యక్తిగతంగా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు నిడదవోలు ఎంఎల్‌ఎగా నియోజకవర్గానికి ఎనలేని సేవలందించిన బూరుగుపల్లి శేషారావు ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యక్తి అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా తనను ఎంపిక చేశారన్నారు. సీనియర్ నాయకుల సహాయ సహకారాలు తన గెలుపుకు దోహదపడతాయని, శేషారావు మద్దతు కోరేందుకు ఆయనను కలిసినట్లు దుర్గేష్ తెలిపారు. తన గెలుపులో శేషారావు సహాయం, నియోజకవర్గ ఓటర్ల సహకారాలు తప్పనిసరిగా అందిస్తానని తెలిపినట్లు దుర్గేష్ చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్ రెండవ నంబర్ ప్లాట్ ఫారం చివర్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50-60 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహన్ని శనివారం జిఆర్‌పి పోలీసులు గుర్తించి స్టేషన్ మాస్టర్‌కు తెలియచేశారు. అనంతరం ఆ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనారోగ్య కారణంగా మృతి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. అతడు బిక్షగాడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కాపు కమ్యూనిటీ భవనానికి భూమిపూజ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి తానేటి వనిత శుక్రవారం రాత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దేవరపల్లి ఎంపిపి కెవికె.దుర్గారావు, కాపు సంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కాపులకు మంచి గుర్తింపు ఇచ్చిందన్నారు. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా కాపుల కోసం ప్రత్యేకించి కాపు నేస్తం వంటి ఎన్నో నూతన పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పసివేదలలో ముప్పిడి పర్యటన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు మండలం పసివేదలలో టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిశారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రానికి ఉన్నత స్థితి ఏర్పడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బేతిన నారాయణ, గుర్రం దిలీప్‌కుమార్, గారపాటి రామ చంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, వేగి లింగేశ్వరరావు, కరుటూరి శ్రీధర అప్పారావు, కొడవటి గంగాజీ, ఇ.వెంకటేశ్వరరావు, వేగి వెంకట రాయుడు, కరుటూరి వెంకటేశ్వరరావు, వి.అప్పారావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

దేవాలయాల నూతన పాలక వర్గాల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వీరవరం గ్రామంలో గల రెండు దేవాలయాలకు పాలకమండళ్లను నియమించారు. శ్రీ కోదండరామస్వామి దేవస్థానం చైర్మన్‌గా లంక కనకారావు, సభ్యులుగా కొత్తపల్లి బ్రహ్మానందం, పెనుగొండ బాలాజీ, పి.వెంకటరమణ, ఎ.నాగసూర్యావతి, బి.పద్మకుమారి, ఇ.సత్యవతి, పి.నాగవల్లిక శనివారం ప్రమాణం స్వీకారం చేశారు. శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా దొంతంశెట్టి వీర వెంకటేశ్వరరావు, సభ్యులుగా పి.వీరరాఘవులు, ఎం.సుబ్బారావు, సిహెచ్.మంగలక్ష్మి, జె.మల్లేశ్వరి, బి.చంటమ్మ, ఎన్.పద్మ ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానాల కార్యనిర్వాహనాధికారి బివి.సుబ్బారావు వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయాల ప్రధాన అర్చకులు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి- కడియం

విజయవాడ కెఎల్ కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాలకు చెందిన 150 మంది బిఎస్‌పి అగ్రికల్చర్ విద్యార్థులు కడియపులంక సత్య దేవా నర్సరీని శనివారం సందర్శించారు. వీరికి నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఇంపోర్టెడ్ మొక్కల మెయింటనెన్స్‌ను, పుల్లా రాజశేఖర్ గ్రాఫ్టింగ్ చేసే విధానం గురించి, ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్‌ల గురించి వివరించారు. వారందరికీ సత్యదేవా నర్సరీ సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్‌ను అందించారు.. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం డాక్టర్ గౌతమ్ కిషోర్, డాక్టర్ ఉదయ్ భాస్కర్, డాక్టర్ శివానందన్, డాక్టర్ సాగరిక తదితరులు పాల్గొన్నారు.

10 మందికి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో 10 మందికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి వేణుగోపాలకృష్ణ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 22 మందికి రు.30 లక్షల మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా 10 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. చేయడం జరిగిందన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుటందన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.25 లక్షలకు పెంపు చేసి ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.38 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎంపిపి సుంకర శ్రీవల్లి, వైసిపి నాయకులు సుంకర వీరబాబు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ మాజీ మంత్రి తోట నరసింహం ఆదేశాల మేరకు గోకవరం ముస్లిం కాలనీలో రూ.6లక్షలతో రెండు సిసి రోడ్లు, బ్రహ్మల కాలనీలో రూ.10 లక్షలతో సిసి రోడ్లు, రూ.8 లక్షలతో ఎస్‌సి శ్మశానవాటిక పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే జరిగిందన్నారు. అదేవిధంగా రంప ఎర్రంపాలెం, పెంటపల్లి గ్రామాల్లో రూ.6లక్షలతో 3 బోర్లు, డ్రెయినేజీపనులకు శంకుస్థాపన చేశామన్నారు. గుమ్మళ్లదొడ్డిలో రూ.6 లక్షలతో శ్మశాన వాటికి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ముందుగానే ప్రలోభాల జాతర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార వైసిపి మహిళా ఓటర్లకు ప్రలోభాల ఎర వేయటం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. సార్వత్రిక ఎన్నికలకు నగరా మోగకుండానే అధికార పార్టీ ప్రలోభాలకు తెరలేపింది. ఈ నేపథ్యంలో వారం రోజుల ముందునుంచే అధికార పార్టీ ప్రలోభాల జోరు పెంచింది. వాలంటీర్లను ప్రసన్నం చేసుకునేందుకు విలువైన గృహోపకణాలు అంద జేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అధికార యంత్రాంగం సహాయంతో పేదలందరికీ ఇళ్లు అనే పథకం పేరుతో జిల్లా వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పంపిణీ ఆర్భాటంగా చేపట్టింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ అర్హత కల్పిస్తూ పట్టాలు జారీ చేసింది. అయితే ఇప్పటికీ ప్రతి సచివాలయంలో వందల కొద్దీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉన్నాయి. మరోవైపు ఓటర్ల జాబితా ఆధారంగా వలంటీర్ల ద్వారా మహిళా ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి చీరల పంపిణీ చేయటంపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. రాజమహేంద్రవరంలో తేదేపా నేతలు మరో అడుగు ముందుకు వేసి చీరలను దగ్ధం చేశారు. మౌళిక వసతులలో ఒకటైన తాగునీ సౌకర్యంపై దృష్టి పెట్టలేకపోయారంటూ ఎద్దేశాచేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అధికార విపక్ష నేతలు ఏ మేరకు నిబంధనలు అనుసరిస్తారో వేచి చూడాలి.

రబీ సాగుకు నీటి గండం

రబీ సాగుకు నీటిగండం మొదలైంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావడంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విధితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి రెండు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలనికేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్ధతను వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించింది. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిల్వ చేసుకోవాలనే ముదుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా శివారు పొలాలకు నీరందక నెర్రలీనటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాల్వల ఆధునీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు.

ఎన్నికలకు రంగం సిద్ధం

సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. అధికార వైసిపి, ప్రతిపక్ష తేదేపా ఇప్పటికే అభ్యర్ధుల జాబితాను పూర్తి స్థాయిలోప్రకటించిన విషయం విధితమే. తేదేపా-బిజేపీ-జనసేన కూటమి ఎంపి అభ్యర్ధి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఎలక్షన్ కమిషనర్ షెడ్యూల్ కూడా ప్రకటించడంతో అధికార యంత్రంగం రంగం సిద్ధం చేసింది. అయతే తేదేపా-జనసేన- బిజేపీ కూటమిలో ఆశావహులకు సీట్లు లేకపోవటంతో నేతలతో పాటు, కార్యకర్తలు భగ్గు మంటున్నారు. పిఠాపురం, కొవ్వూరునియోజక వర్గాల్లో ఇప్పటికే తిరుగుబావుటా ఎగరేసేందుకు సిద్ధం అయ్యారు. అధినేతలు ఏ మేరకు బుజ్జగిస్తారో వేచి చూడాల్సి ఉంది. లేని పక్షంలో కూటమి నేతలకు చుక్కెదరు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు అధికార పార్టీలోనూ అంతర్మథనం మొదలైంది. కొన్ని నియోజక వర్గాల్లో అభ్యర్ధులకు స్థాన చలనం కల్పించిన విషయం విధితమే. ఈ మేరకు అక్కడి కార్యకర్తలను కలుపుకుని వెళ్లడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కార్యకర్తలతో పాటు ప్రజల నమ్మకాన్ని ఏ మేరకు పొందగలరో వేచి చూడాలి.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

ఈనెల 18 నుంచి జరిగే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, మహేశ్వరరావు తెలిపారు. శనివారం మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మండలలో గోపాలపురం హై స్కూల్, గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాల, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం వేలచింతలగూడెం, రాజంపాలెం హై స్కూల్, సెయింట్ మేరీ స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ దొండపూడి సెంటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. మండలంలో 9 హైస్కూల్స్, రెండు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్, మూడు ప్రైవేటు స్కూల్స్ సంబంధించి మొత్తం 10వ తరగతి విద్యార్థులు 978 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలన్నీ సర్వం సిద్ధం చేసినట్లు వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, పరీక్ష సిబ్బంది సెల్ ఫోన్స్ తీసుకురాకూడదని అనుమతి లేదని తెలిపారు. ఎగ్జామ్స్ సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య సిబ్బంది ఉంటారని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాల్ టికెట్లతో సూచించిన సమయానికి అంటే ముందే హాజరవ్వాలని తెలిపారు. పరీక్ష రాసి విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురవకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు.

18 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం

ఈనెల 18 నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, మహేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12: 30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్ష సెంటర్లు నిర్వహిస్తున్న ఐదు పాఠశాలకు మధ్యాహ్నం 1:00 గంట నుండి 5 గంటల వరకు పాఠశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల నియమావళి శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి దృశ్య విజ్ఞాన మాధ్యమం ద్వారా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, రాజమండ్రి పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి డా కె.మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ 2024 సార్వత్రిక ఎన్నికలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎన్నికల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సందర్భంగా ప్రవర్తన నియమావళి పై సూచనలు చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, సంబంధిత అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది వెంటనే వారికీ నిర్దేశించిన ఎన్నికల , అనుబంధ కార్యకలాపాలను చేపట్టాలన్నారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఈరోజు నుంచే విధులను నిర్వర్తించడం ప్రారంభించాలన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ ఏర్పాటు చేసుకొవాలని, ఇందుకు సంబంధించి జిల్లా రవాణా అధికారిని సంప్రదించాలన్నారు. స్టాస్టిటిక్ సర్వైవల్ బృందాలు, బోర్డర్ టీమ్స్ .. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి విధులను నిర్వర్తించడం ప్రారంభించాలని స్పష్టం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టుకు సంబంధించి పర్యవేక్షణ బాధ్యతలను అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిర్వర్తించాలని తెలిపారు. వ్యక్తిగతంగా రూ.50 వేలు మించి నగదు రూపంలో తీసుకుని వెళ్లడానికి అనుమతి లేదని, ఎటువంటి ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తాలను తీసుకు వెళ్తే సీజ్ చేయాలన్నారు. ప్రతి ఒక్క ఘటనను వీడియో రికార్డింగ్ చెయ్యడం, వాటితో పాటు వాయిస్ ఓవర్ కూడా రికార్డింగ్ చేయడం చాలా అవసరం అన్నారు. అధికార వాహనాల వినియోగంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహ రించాలన్నారు. మంత్రులు,ఇతర రాజకీయ నాయకులు పాల్గొనే సమీక్షలు, సమావేశాల్లో ప్రభుత్వ అధికారులు సిబ్బంది వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా హాజరు కారాదని, వారితో ఎట్టి పరిస్థితుల్లోనూ కలువ రాదని, కార్యాలయాల్లో మాత్రమే రాజకీయ పార్టీల ప్రతినిధులు వొచ్చి ఎన్నికల అధికారిక విధులు కింద మాత్రమే కలవవచ్చు అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు విషయంలో అనుసరించాల్సిన విధి విధానాలపై మార్గదర్శకాల కచ్చితంగా పాటించాలన్నారు. సైరన్ కలిగిన పైలట్ కారుతో మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు పర్యటనలలో ఉపయోగించరాదని తెలిపారు. పోస్టర్లు, ఫ్లెక్సీలువెంటనే తొలగించాలన్నారు నిర్ణీత రుసుం చెల్లించి ప్రదర్శించిన వాటిని కొనసాగించవచ్చు అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రభుత్వ ప్రకటన లని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం, ప్రచురించే అన్ని ప్రకటనలు రానున్న 48 గంటలు లోగా నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలపై రాజకీయ నాయకుల, కార్యకర్తల ఛాయా చిత్రాలు మరియు చిత్రాలు ప్రదర్శించరాదన్నారు. మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాల్లో వసతి కల్పించరాదన్నారు. ఎస్‌పి జగదీష్ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ఉపయోగించే విడియో వాహనాలకు సెక్షన్ 52 ప్రకారం కచ్చితంగా ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి కొట్టు

ప్రజాశక్తి - అన్నవరం

స్థానిక సత్యదేవ డిగ్రీ కళాశాల సమీపంలో కొత్తగా రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపడు తున్న స్వామి నమూనాలయం ఆవరణలో ప్రసాద విక్రయ కౌంటర్‌ను మంత్రి కొట్టు సత్యనారాయణ టెంకాయ కొట్టి హడావిడిగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బైపాస్‌లో ప్రస్తుతం ఒకవైపున స్వామి నమూనాలయం వద్ద భక్తులు ప్రసాదాలు కొనేందుకు రాజమహేంద్రవరం వైపు వెళ్లేవాళ్లు రోడ్డు దాటే పరిస్థితి ఉందని, దీనివలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఇటువైపు కూడా కొత్తగా స్వామి నమూనాలయం నిర్మిస్తు న్నామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రసాదాలు అమ్మే కౌంటర్‌ను ముందుగానే ప్రారంభించడం జరిగిందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అనంతరం కొండపైకి వచ్చిన మంత్రికి దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్ ఆలయ లాంచనాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సత్యదేవుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్‌ఓ కృష్ణారావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరిపై మంత్రి కొట్టు సత్యనారాయణ

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చిరుధాన్యాల్లో అధిక పోషక లాభాలు ఉన్నందున వాటిని తప్పక వినియోగించాలని చెముడులంక సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అంగన్‌వాడీలకు సూచించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దష్టి సారించాలని ఆమె అంగన్‌వాడీలను ఆదేశించారు. మండలంలోని మడికి అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమానికి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను ఉపయోగించే విధానం, ఉత్తమ పోషకారం, పరిశుభ్రత గురించి ఏ వివరించారు. అదేవిధంగా బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి వరించారు. చిరు ధాన్యాలతో వండిన ఆహారం పదార్థాలతో అంగన్‌వాడీల వద్ద ఏర్పాటు చేసినా స్టాల్స్‌లో చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కె.మెర్సీ ఫ్లోరెన్సీ, సిహెచ్.భానుకుమారి, పి.సత్యవతి, పి.రమణ, సిహెచ్.మంగ తాయారు, పలువురు అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వరలక్ష్మి

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

ప్రజాశక్తి - కాకినాడ

రానున్న ఎన్నికల నేపథ్యంలో కాకినాడ ముఖ ద్వారాల వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టుల వద్ద పటిష్టవంతమైన నిఘా ఏర్పాటు చేయాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. శనివారం పోలీస్, రెవెన్యూ, ఎన్నికల సిబ్బందితో కలిసి ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పరిశీలించారు. ప్రతాప్‌నగర్ వంతెన, ఉప్పలంక జంక్షన్, కుంభాభిషేకం రేవు ప్రాంతాల్లో స్టేటిక్ సర్వేలైన్స్ బృందాల పర్యవేక్షణ చేయాల్సిన అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. ఆయా ప్రాంతాలకు వెళ్ళిన ఆర్‌ఓ అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బయటప్రాంతాల నుంచి సిటీ నియోజకవర్గంలోకి డబ్బు, మద్యం ఎలా నియంత్రించాలనే అంశంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ పర్యటనలో డిఎస్‌పి హనుమంతరావు, నగరపాలక సంస్థ ఎస్‌ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్‌ఇ పి.వెంకటరావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఇఇ మాధవీ, తహశీల్దార్ దొర, ఎఇ వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జలజీవన్ మిషన్, ఒఎన్‌జిసి సిఎస్‌ఆర్. నిధులతో ముమ్మిడివరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించినట్లు ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.35 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 80 ట్యాంకులు నిర్మించి ప్రజలకు తాగునీరు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు సామ్యూల్‌సాగర్, స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, మాతరాజు, పోతాబత్తుల నూకరాజు, చెక్క కామేశ్వరరావు, రేకాడి నరసింహమూర్తి పాల్గొన్నారు.

కార్యకర్తలతో గొల్లపల్లి సమావేశం

ప్రజాశక్తి-మామిడికుదురు

మామిడికుదురు అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో శనివారం బొలిసెట్టి భగవాన్ అధ్యక్షతన ఏడు గ్రామాల వైసిపి కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజోలుఅభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో సిఎం జగన్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతో పాటు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. సంక్షేమము నిరంతరం కొనసాగాలంటే మళ్ళీ జగనన్న రావాలని ప్రజలకు తెలియజేయలన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట సీనియర్ వైసిపి నాయకులు, లారీ యూనియన్ మాజీ అధ్యక్షులు ముత్యం రాజుబాబు, మరో 100 మందితో టిడిపిలో చేరారు. శనివారం స్థానిక పాత తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ముత్యం రాజుబాబు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపితో కలసి పనిచేసేవారికి ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. పార్టీలో ఇప్పటికే పనిచేస్తున్న సీనియర్లు కొత్తగా వచ్చినవారిని కలుపుకుని టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, పట్టణ పార్టీ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, రైతు నాయకులు కంటే జగదీష్ మోహన్‌బాబు, టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు, పాల్గొన్నారు.

దంతాల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మనం తీసుకునే ఆహారం జీర్ణం కావాలంటే దంతాల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం ముఖ్యమని ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ శ్రీవల్లి అన్నారు. సర్పవరం జంక్షన్‌లో ఇండియన్ దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దంతాలు దృఢంగా, పటిష్టంగా ఉంటేనే అన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోగలుగుతామని అన్నారు. తద్వారా పోషకాలు సక్రమంగా అంది రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దంతాల మధ్య ఖాళీలు ఏర్పడితే వెంటనే దంత వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలన నుంచి విముక్తే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలోని వైసిపి అరాచక పాలనకు విముక్తి కల్పించడమే లక్ష్యం కావాలని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, బిసి డిక్లరేషన్ పోస్టర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించడం కోసమే టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. వైసిపి అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజలు దగాపడ్డారన్నారు.

యానాం వార్తలు

కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యం

ప్రజాశక్తి - యానాం

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ సిఎల్‌పి లీడర్, పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ వైద్యనాథన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన యానాంలో పర్యటించారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ యానాం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, అధ్యక్షుడు అర్థాని దినేష్‌లు ఘనంగా స్వాగతం పలికారు. తొలుతగా పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్థానిక జివిఎస్ హోటల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎంపి అభ్యర్థికి అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటంశెట్టి రామంముర్తి, విళ్ల చిన్ని, మల్లాడి బీరాస్వామి, రాముదాజు, దవులూరి పతి, దున్నా చక్రవర్తి, సత్య పెరుమాళ్, లంక బంగారం, మున్నా, తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 19న పుదుచ్చేరి లోక్‌సభకు ఎన్నిక

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి మొదటిదశలో ఏప్రిల్ 19న పోలింగ్ జరిగనుంది. ఈనెల 20న నోటిఫికేషన్, నామినేషన్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీ 27, అభ్యర్థుల నామినేషన్ల స్క్రూట్నీ 28, నామినేషన్ల ఉపసంహరణ 30, ఏప్రిల్ 19న పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఈ మేరకు శనివారం పుదుచ్చేరి ఎన్నికల అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నగారా మ్రోగడంతో ఎన్నికల కోడ్ అమలలోకి వచ్చిందని, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు బ్యానర్లు తొలగించాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

చిన్నాసెంటర్‌కు వెంకన్న రథం

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలలో భాగంగా స్వామి రథాన్ని చిన్నా సెంటర్‌కు ట్రాక్టర్ సహాయంతో చేర్చారు. స్వామి రథోత్సవం ఈనెల 22న జరగనుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఖండవల్లి రామకృష్ణ, కళ్యాణోత్సవాల కమిటీ ప్రతినిధులు, పాల్గొన్నారు.

తుప్పలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - యానాం

యానాంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో శనివారం కురసాంపేట, అయ్యన్న నగర్ గ్రామాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సిహెచ్.నరేష్, ఎస్.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వలంటీర్లు గ్రామస్తులతో మమేకమై విద్య యొక్క ప్రాముఖ్యత, యువత, పిల్లలకు ఉన్నత విద్యావకాశాలు గురించి వివరించారు.

పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - యానాం

సమాచార శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నిర్వహించారు. స్థానిక యానాం ఫెర్రీ రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పోలీస్ సిబ్బంది, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విగ్రహాలకు ముసుగులు, ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నాయకుల విగ్రహాలకు ముసుగులు, గ్రామాల్లో పలుచోట్ల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల తొలగింపు, గోడపత్రికల తొలగింపు వంటి కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామ కూడళ్లలో ఏర్పాటుచేసిన వివిధ పార్టీలకు చెందిన భారీ ఫ్లెక్సీలను తొలగించేందుకు ఆయా అభ్యర్థులకు సమాచారం అందించినట్లు చివటం పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణవేణి తెలిపారు. వారికి ఇచ్చిన సమయంలో ఫ్లెక్సీలను తొలగించని యెడల అధికారులే స్వచ్ఛందంగా ఫ్లెక్సీలు తొలగింపు చేపడతారన్నారు. ఈ సందర్భంగా చివటం గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ముసుగులు వేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ ఎ.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది వంశీ రాజ్, భువన, వీర్రాజు, సుబ్బారావు, పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినవి

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, సర్పవరం, భావనారాయణపుపం, డో.నెం. 6-48రు నివాసియైన శీలం సురేష్ గారి భార్య **శీలం కుమారి,** వయస్సు 33 సం॥లు అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నేను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును ది.10-03-2024వ తేదీ ఉదయం 10.30 ని॥లకు జెరాక్స్ తీయు నిమిత్తము నా ఇంటి వద్ద నుండి సర్పవరం వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.Y5201467 పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. సదరు పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

శీలం కుమారి
W/o. సురేష్, డో.నెం.6-48,
భావనారాయణపురం, సర్పవరం
కాకినాడ, సెల్: 95420 22554